క్లుప్తంగా

ఘనంగా కనుమ ఉత్సవం


విశేషాలంకరణలో పద్మావతి అమ్మవారు

తిరుచానూరు : పద్మావతి అమ్మవారి ఆలయంలో సోమవారం కనుమ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగింపుగా శుక్రవారపు తోటకు తీసుకొచ్చారు. అక్కడి మండపంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం గజరాజులు, గోమాతలకు పూజలు చేసి మాడవీధుల్లో అమ్మవారిని ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్లు మధు, శేషగిరి, ఇన్‌స్పెక్టర్లు దాము, ప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో సకల సౌకర్యాలు


అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవర్

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి దర్శనానికి దేశ విదేశాల నుంచి భక్తులు తిరుపతి రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారని, ఈ క్రమంలో సకల సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవర్ తెలిపారు. ఆమె ఆదివారం తిరుపతి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. సౌకర్యాలపై ప్రయాణికులతో మాట్లాడారు. చిన్న పాటి సమస్య సైతం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణను ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యతలో లోపం రాకుండా చూడాలన్నారు. భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లగేజీ తనిఖీలోనూ రాజీ పడొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, నేతలు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాసులు, గుండాల గోపీనాథ్, వరప్రసాద్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ గోశాలలో ఘనంగా గోపూజోత్సవం

తిరుపతి రూరల్: తిరుపతి వెంకటేశ్వర గోసంరక్షణ శాలలో కనుమ పండుగ సందర్భంగా సోమవారం గోపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగానం, తిరుమల వెంకటేశ్వర వేదపాఠశాల విద్యార్థులు వేద పారాయణం చేపట్టారు. దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారుల భజనలు, కోలాటాలు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తన కార్యక్రమాలు అలరించాయి. టీటీడీ ఈవో ధర్మారెడ్డి వేణుగోపాల స్వామి సన్నిధిలో గోపూజ చేశారు. గోమాతకు ప్రత్యేక పూజలు చేసి దానా తినిపించారు. వేణుగోపాలస్వామి హారతి, తులసి పూజ, గొబ్బెమ్మ వేడుక, గజపూజ, అశ్వపూజ, వృషభ పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు వేణుగోపాలస్వామివారి దర్శనం, ప్రసాదం పంపిణీ చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు అతిథులు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేఈవో సదా భార్గవి, టీటీడీ గో సంరక్షణ ట్రస్టు సభ్యుడు రామ్ సునీల్ రెడ్డి, గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

రంకెలేసిన కోడెగిత్తలు


పాకాలలో ఎద్దులను పట్టుకుంటున్న యువకులు


పాకాల: కోడెగిత్తలను నిలువరిస్తున్న యువకులు


రామచంద్రాపురంలో..


రామచంద్రాపురం: పరుష పందేలను చూడడానికి వచ్చిన జనసందోహం


రామచంద్రాపురం: ఎద్దును పట్టుకున్న యువకులు


భాకరాపేట: పశువులను చిట్లాకుప్ప వద్దకు తీసుకువచ్చిన రైతులు


రామచంద్రాపురం: గెలుపొందిన పలకలతో యువకులు

రామచంద్రాపురం: మండలంలోని బొప్పరాజుపల్లిలో సోమవారం పశువుల పండుగను పురస్కరించుకుని పరుష పందేలు కోలాహలంగా జరిగాయి. పశువులకు కట్టిన పలకలు, టవళ్లను సొంతం చేసుకోవడానికి, పశువులను నిలువరించడానికి యువకులు ఉత్సాహం చూపారు. ముందుగా యజమానులు తమ పశువుల కొమ్ములను అందంగా చెక్కి, రంగులు పూసి అలంకరించారు. చెక్కలతో తయారుచేసిన పలకలకు రంగు కాగితాలు అతికించారు. అనంతరం పశువులను బెదిరించి వదిలారు. వేగంగా దూసుకువస్తున్న పశువులను పట్టుకోవడానికి యువకులు పోటీపడ్డారు. ఈ పరుష పందేలను తిలకించడానికి మండలం నుంచే కాక పరిసర మండలాల నుంచి జనం పోటెత్తారు.

పాకాల : మండలంలోని గానుగపెంటలో సోమవారం పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఎద్దుల కొమ్ములకు రంగులు వేసి సుందరంగా అలంకరించారు. అనంతరం వాటిని వీధుల్లో ఊరేగించారు. యువకులు వాటిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలో సోమవారం పశువుల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులను నల్లదారాలు, మువ్వలు, గజ్జెలు, గంటలు, బెలూన్లు, పూల హారాలతో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం పశువుల దేవర వద్దకు తీసుకెళ్లి డప్పులతో శబ్దాలు చేసి పరుగులు తీయించారు. అనంతరం కాటమరాజు వద్ద ఏర్పాటు చేసిన చిట్లాకుప్పలకు నిప్పు పెట్టారు. పశువులను వాటి చుట్టూ తిప్పి అక్కడ వండిన ప్రసాదం తినిపించారు.

క్షతగాత్రులకు ఎంపీ పరామర్శ


గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి

తిరుపతి తుడా: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పరామర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పర్యటనలో సోమవారం చిన్నపాటి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ నారాయణ, భద్రతా సిబ్బంది గోపీనాథ్, సుధాకర్, చంద్రన్ మధుసూదన్ రెడ్డిని మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఎంపీ మిథున్ రెడ్డి ఆస్పత్రికి చేరుకుని వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కనుల పండువగా రథోత్సవం


రథంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీమూలస్థాన ఎల్లమ్మ

- భూత వాహనంపై మూలస్థాన ఎల్లమ్మ విహారం
- నేడు ఎమ్మెల్యే చెవిరెడ్డి పట్టు వస్త్రాల సమర్పణ

చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం అమ్మవారు రథంపై ఆశీనులై పట్టణంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కళాకారుల చెక్క భజనలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారు ఆదివారం సాయంత్రం భూత వాహనంపై అమ్మవారి మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు ఉదయం అమ్మవారితో పాటు పరివార దేవతలకు అభిషేకం, అలంకరణలు చేశారు. సాయంత్రం అమ్మవారు సింహ వాహనంపై దుర్గ అలంకరణలో భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, ఉభయదాతలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పట్టు వస్త్రాల సమర్పణ

మూలస్థాన ఎల్లమ్మ కొండ చుట్టు మహోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. స్థానిక కోదండరామాలయం నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు


బొమ్మల కొలువును తిలకిస్తున్న రంగస్థలి చైర్మన్, మహిళలు

తిరుపతి కల్చరల్: త్యాగరాజనగర్‌లో భాగవతుల నాగలక్ష్మి స్వగృహంలో సంక్రాంతిని పురస్కరించుకొని ఆదివారం ఆమె కుమార్తెలు సాయి శిరీష, లక్ష్మీశృతి ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక భావం కలిగిన ఆ చిన్నారుల అమ్మమ్మ లంక శేషు మంజుల(82) ప్రతి ఏటా సంక్రాంతికి బొమ్మల కొలువు ఏర్పాటు చేసేవారు. ఆమె మనవరాళ్లు కూడా ఇంటిలో సంక్రాంతి నాడు బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. వారిని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి అభినందించారు.

అంబరాన్నంటిన సంబరాలు


నృత్య ప్రదర్శనలు చేస్తున్న చెన్నై కళాకారులు

తిరుచానూరు: సంప్రదాయాలు ఉట్టిపడేలా శిల్పారామంలో ఆదివారం చేపట్టిన సంక్రాంతి, కనుమ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామీణ పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్లు పెట్టారు. రంగవల్లులను తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగిరెద్దుల ఆటలు ఆకట్టుకున్నాయి. హరిదాసులు సంకీర్తనలతో ఆలరించారు. చిన్నారులు పతంగాలు ఎగురవేస్తూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో సంప్రదాయ తినుబండారాలు అందరూ ఆరగిస్తూ ఆనంద భరితులయ్యారు. సంక్రాంతి పర్వదినాన అధికంగా జనం తమ కుటుంబ సభ్యులతో శిల్పారామానికి విచ్చేయడంతో శిల్పారామం కిక్కిరిసింది. ఈ సందర్భంగా ప్రత్యేక వేదికపై కళాకారులు ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కమెడియన్ సుధాకర్ ప్రదర్శించిన కామెడీ స్కిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చెన్నైకి చెందిన విజయ్ బృందం భరత నాట్యం, నెల్లూరు, తిరుపతికి చెందిన కోటి, రజని బృందం సినీ నృత్యాలు హోరెత్తించాయి.

గోపూజలో ఎమ్మెల్యే భూమన


గోశాలలో గోవులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: కనుమ పండుగను పురస్కరించుకొని తాతానగర్‌లోని దొడ్డారెడ్డి జయరామిరెడ్డి గోశాలలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గోవులకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, బీజేపీ నేత సైకం జయచంద్రారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పనుల పరిశీలన

తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సోమవారం రాత్రి పరిశీలించారు. ఆలయ గర్భాలయ నిర్మాణానికి తవ్విన చోట మట్టికి ఆయన మొక్కారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ అనుకున్న మేరకు రానున్న అమ్మవారి గంగజాతర లోపు ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఈవో ఎం.మునిక్రిష్ణయ్యను ఆదేశించారు. ఆయన వెంట మేయర్ శిరీష, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, గీతా యాదవ్ ఉన్నారు.

పెద్దల పండుగ నాడు పోటెత్తిన కపిలతీర్థం


జనంతో కిక్కిరిసిన కపిలతీర్థం ప్రాంగణం

తిరుపతి కల్చరల్: మకర సంక్రాంతి నాడు తమ కుటుంబ పెద్దలకు పితృతర్పణం చేసేందుకు వచ్చిన జనంతో ఆదివారం కపిలతీర్థం పోటెత్తింది. మూడు రోజుల సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా దివంగతులపైన కుటుంబ పెద్దలకు మకర సంక్రాంతి నాడు పితృతర్పణం, పిండప్రదానం చేసి స్మరించుకోవడం ఆనవాయితీ. చంద్రమాన శ్రీ శుభకృత్ నామ సంవత్సరం పుష్యమాసం, బహుళ అష్టమి 14వ తేదీ శనివారం రాత్రి 2.02 గంటలకు రవి మకర రాశిలో ప్రవేశం చేయడంతో ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమైంది. కాగా ఆదివారం రోజుంతా మకర సంక్రాంతి ఉంటుంది. ఈ సమయంలో పితృతర్పణం చేసేందుకు తిరుపతి నగర ప్రజలే కాక చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కపిలతీర్థానికి చేరుకోవడంతో ఆ ప్రాంతం జనంతో కిక్కిరిసింది.


పెద్దలకు పింద ప్రదానం చేస్తున్న ప్రజలు




టీటీడీ ఏడీ బిల్డింగ్ మైదానంలో జరిగిన గోదాదేవి కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రజలు, గోదాదేవి, శ్రీకృష్ణస్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు

వైభవంగా గోదాదేవి పరిణయోత్సవం




విశేషాలంకరణలో అమ్మవారు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయం, టీటీడీ ఏడీ బిల్డింగ్ మైదానం వద్ద సోమవారం గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గోవిందరాజ స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి సహస్రనామార్చన చేశారు. అనంతరం పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి మేల్ ఛాట్ వస్త్రం, పూలమాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆండాళ్ అమ్మవారికి సమర్పించారు. తర్వాత ఆండాళ్ అమ్మవారికి లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం నుంచి 6 గంటల వరకు పుండరీకవల్లి అమ్మవారి ఆలయం వద్ద శ్రీకృష్ణ స్వామికి, గోదాదేవి అమ్మవారికి పరిణయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దజీయంగార్ స్వామి, చిన్నజీయంగార్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి పాల్గొన్నారు.